క్లుప్తంగా

రేపు చింత చెట్ల ఫలసాయం వేలం

పెద్దతిప్పసముద్రం: మదనపల్లిలోని ఆర్అండ్బీ కార్యాలయంలో మంగళవారం చింతచెట్ల ఫలసాయం కొరకు వేలం పాటలు నిర్వహిస్తామని ఆర్అండ్బీ జేఈ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బూర్లపల్లి-టి.సదుం రోడ్డు, ములకలచెరువు-తంబళ్లపల్లి, ములకలచెరువు-బి.కొత్తకోట, కాండ్లమడుగు రోడ్డు, ములకలచెరువు-తంబళ్లపల్లి రోడ్డు పక్కన ఉన్న ఆర్అండ్బీ శాఖకు చెందిన చింత చెట్ల ఫలసాయంపై వేలం పాటలు జరుగుతాయని ఆశక్తి గలవారు రూ.1,000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని జేఈ పేర్కొన్నారు.

మల్లయ్యకొండకు వంటపాత్రలు వితరణ



వంటపాత్రలు అందజేస్తున్న దాత

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి మర్రిమాకులపల్లెకు చెందిన ఏ.భువనేశ్వర రెడ్డి వంటపాత్రలు వితరణగా ఇచ్చారు. ఆదివారం భువనేశ్వరరెడ్డి కుటుంబీకులతో ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

కత్తి రామలింగారెడ్డికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న కత్తి రామలింగారెడ్డి

పీలేరు : పీలేరుకు చెందిన శ్రీ లక్ష్మీవెంకటేశ్వర నాట్య కళామండలి అధ్యక్షుడు, జానపద నృత్య కళాకారుల గురువు కత్తి రామలింగారెడ్డికి డాక్టరేట్ లభించింది. శనివారం రాత్రి హైదరాబాద్లోని సరస్వతి పరిషత్ కార్యాలయంలో మనం ఫౌండేషన్, హెచ్ఆర్ఈ ఆర్చిబిషప్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి డాక్టరేట్, నంది అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా కళారంగంలో 42 సంవత్సరాలుగా విశేష సేవలందించిన కత్తి రామలింగారెడ్డిని కళాబ్రహ్మ గోల్డెన్ నంది నేషనల్ అవార్డుతో సత్కరించారు. అలాగే మనం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చక్రవర్తి డాక్టరేట్ ప్రదానం చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న యాదవ ఉద్యోగుల సంఘం నాయకులు

మదనపల్లె సిటీ: స్థానిక శ్రీకృష్ణ ఆలయంలో ఆదివారం యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు. యాదవ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.వెంకటయ్య మాట్లాడుతూ యూనియన్ బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రెడ్డప్పయాదవ్, నాగరాజు, సురేష్ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫౌండేషన్ సభ్యుడైన మండలంలోని పట్టింవాండ్లపల్లికి చెందిన హరీష్ భార్య క్రిష్ణవేణి పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులకు అన్నదాన చేసినట్లు అధ్యక్షుడు రాజశేఖర్, సభ్యులు భాగ్యమ్మ, రాజు, అనిల్ పేర్కొన్నారు.

చెంతనే నీరు.. అందని తీరు!

- తూములు లేక అవస్థలు
- బీడుగా మారిన ఆయకట్టు
- ఆందోళనలో అన్నదాతలు



నీటితో కళకళలాడుతున్న లంచకుంట చెరువు

పెద్దమండ్యం: చెరువు నిండినా ఆ చెరువు కింద ఉన్న ఆయకట్టు భూముల్లో పంట సాగు కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువు కింద ఉన్న ఆయకట్టు భూముల్లో హంద్రీ-నీవా ప్రధాన, ఉప కాలువల పనులు జరిగాయి. ఈ కాలువ పనులతో ఆయకట్టు భూములకు చెరువు నీటిని మళ్లించే పిల్లకాలువలు గల్లంతైపోయాయి. చెరువు నిండినా ఆయకట్టు భూములకు సాగునీరు వెళ్లే మార్గం లేక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాలలోకి వెళితే.. పెద్దమండ్యం పంచాయతీలో చెరువుకిందపల్లె వద్ద లంచకుంట చెరువు ఉంది. మండలంలోని పెద్ద చెరువుల్లో లంచకుంట చెరువు ఒకటి. ఈ చెరువు కింద ఉప్పరపల్లె, చెరువుకిందపల్లె, పెద్దమండ్యం, రామానాయక్తాండాలకు చెందిన రైతుల ఆయకట్టు భూములు ఉన్నాయి. కుషావతీ నదికి ఈ చెరువును అనుసంధానం చేశారు. కుషావతి నది నుంచి ఈ చెరువుకు నీటిని మళ్లించేందుకు సప్లయ్ ఛానల్ ఉంది. గెలసంవారిపల్లె వద్ద కుషావతి నదిపై నల్లరాతిమడుగు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు.

గల్లంతైన కాలువలు

ప్రాజెక్టు పనులలో లంచకుంట చెరువు సప్లయ్ ఛానల్ను తొలగించారు. దీంతో చెరువుకు ప్రధాన నీటి వనరుగా ఉన్న కుషావతీ నీరు రాక పోవడంతో బోసిపోయినట్లయింది. అయితే ప్రాజెక్టు పనులలో భాగంగా తొలగించిన సప్లయ్ ఛానల్కు గతంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు జేసీబీతో పనులు చేయించి నీటిని మళ్లించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నెల రోజులుగా కాలువ ద్వారా నీరు వస్తుండడంతో చెరువు నిండుకుంటోంది. అయితే చెరువు కింద ఉన్న ఆయకట్టు భూముల్లో పంట సాగు చేసేందుకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆయకట్టు భూములకు చెరువు తూములో సాగునీటిని వదిలితే అక్కడే ఉన్న హంద్రీ-నీవా కాలువలోకి వెళ్లే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఆయకట్టు భూములకు నీరు వెళ్లేందుకు హంద్రీ-నీవా కాలువల వద్ద తూములు ఏర్పాటు చేయాలని రైతులు అధికారులను వేడుకొంటున్నారు. తూములు ఏర్పాటు చేయకపోతే ఆయకట్టు భూముల్లో పంట సాగుచేసే పరిస్థితి లేక పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గల్లంతైన పిల్ల కాలువల వద్ద తూములు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

తూములు ఏర్పాటు చేయాలి



చెరువు కింద ఆయకట్టు భూములకు నీరు వెళ్లే పిల్లకాలువలు గల్లంతైన చోట తూములు వెంటనే ఏర్పాటు చేయాలి. ఆయకట్టు భూములకు నీరు వెళ్లేందుకు నాలుగు పిల్ల కాలువలు ఉండేవి. కాలువల పనులతో పిల్ల కాలువలు లేకుండా పోయాయి. చెరువు నిండినా వరి పంట సాగుచేసేందుకు నారు మడ్లు వేసే పరిస్థితి లేకుండా పోతోంది. అధికారులు స్పందించి వెంటనే తూములను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఎం.వెంకటయ్య, ఆయకట్టు రైతు, చెరువుకిందపల్లె

నాలుగు దశాబ్దాల తర్వాత కలయిక

ములకలచెరువు: బాల్యమిత్రులు 40 ఏళ్ల కిందట విడిపోయి ఎక్కడి ఎక్కడికో వెళ్లారు. ఉన్నత చదువులు చదివారు, కొందరు ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగాల్లో.. మరికొందరు వ్యాపారాల్లో స్థిరపడ్డారు. అలాంటి వారందరూ చదువులమ్మబడికి ఆదివారం మళ్లి చేరారు. స్థానిక ములకలచెరువు జెడ్పీ హైస్కూల్లో 1984 – 85 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువు అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వాళ్లందరూ వచ్చి ఒకరికొకరు కలుసుకుని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. అప్పటి గురువులు వరదాచార్యులు, మునాఫ్లను సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. పూర్వ విద్యార్థులు తోట గిరి, సత్యనారాయణ, ప్రసాద్, చంద్రశేఖర్, విజయారెడ్డి, రెడ్డెమ్మ, నిర్మల పాల్గొన్నారు.



ములకలచెరువు జెడ్పీ హైస్కూల్ 1984 - 85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

రెడ్డెమ్మకొండలో భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయంలో అమ్మవారికి ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేషమైన పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి సమీపంలోని దిగువ తొట్లివారిపల్లెలో అమ్మవారి అర్చకులు పంపిణీ చేసే ఆకు పసరును సేవించిన మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించారు. తడిబట్టలతోనే అమ్మవారి ముందు సంతానం కోసం వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరసారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు.



శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో సంతానం కోసం వరపడిన మహిళలు

పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. భక్తులు ఆలయమెట్లకు పూజలు నిర్వహించారు.

న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు

- అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు
- డీఎస్పీ కొండయ్యనాయుడు



మదనపల్లె : న్యూ ఇయర్ వేడుకలకు పోలీసులు ఆంక్షలు విధించారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సమయం మేరకు మాత్రమే హోటళ్లు, వైన్షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు పనిచేయాల్సి ఉంటుందని డీఎస్పీ కొండయ్యానాయుడు ఆదేశించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మదనపల్లె పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించేందుకు పోలీస్శాఖకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈవెంట్ల నిర్వహణ స్థలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తాగి వాహనాలు నడిపే వ్యక్తులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులుచేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్ లేకుండా పెద్ద పెద్ద ధ్వనులు చేసుకుంటూ తిరిగినా, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే, వాహనాలను సీజ్ చేసి డ్రైవింగ్ లైసెన్స్ను రద్దుచేయాలని ఆర్టీఓ ఆఫీసుకు సిఫారసు చేస్తామన్నారు.

శనేశ్వరస్వామికి శనిత్రయోదశి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రామసముద్రం : మండల కేంద్రంలో వెలసిన శనీశ్వరస్వామి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి ఆలయంలో అర్చకులు నాగార్జున పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి పలురకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారికి నువ్వులునూనె, నల్లని వస్త్రం, బెల్లం, నల్లనువ్వులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు మహామంగళహారతి ఇచ్చి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

బుగ్గ కాల్వ వంతెన శిథిలం



ప్రమాదకరంగా మారిన బుగ్గకాల్వ వంతెన

మదనపల్లె సిటీ: స్థానిక వివేకానంద నగర్ వద్దనున్న బుగ్గ కాల్వ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. రోడ్డు నిర్మాణంలో వినియోగించిన కాంక్రీట్ పాడై, ఇనుప కమ్మీలు బయటకు వచ్చి ప్రమాదంగా మారాయి. వంతెనకు ఇరు వైపులా రెయిలింగ్ ఊడిపోవడంతో నిత్యం ఈ బ్రిడ్జిపై ట్రాక్టర్లు, లారీలు, బస్సులు, స్కూల్ వ్యాన్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏవీ వాహనాలు ప్రయాణించడంతో బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని మదనపల్లె టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరావు ఎమ్మెల్యే షాజహాన్బాషాకు వినతిపత్రం అందజేశారు.

పవన్కల్యాణ్ పరామర్శలో రాజకీయ కుట్ర



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్కుమార్

మదనపల్లె : రాజకీయ కుట్రలోనే భాగంగా డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్, ఎంపీడీఓ జవహర్ బాబును పరామర్శించారే తప్ప, నిజంగా చిత్తశుద్ధి ఉంటే కాకినాడ, తిరుపతిలో దాడులకు గురైన ప్రొఫెసర్లు, డాక్టర్లను ఎందుకు పరామర్శించలేదని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్కుమార్ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాలివీడు ఘటనలో దాడికి గురైన ఎంపీడీఓ జవహర్బాబును పరామర్శించిన పవన్కల్యాణ్, కాకినాడలో తన సొంతపార్టీ ఎమ్మెల్యే పంతం నానాజీ చేతిలో దాడికి గురైన దళిత డాక్టర్ ఉమామహేశ్వరరావును, తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో బీజేపీ నాయకుల దాడిలో బాధితుడైన ప్రొఫెసర్ చెంగయ్యను ఎందుకు పరామర్శించలేదో సమాధానం చెప్పాలన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక దళిత అధికారులు, ప్రజాప్రతినిధులను మాత్రమే ప్రభుత్వం వేధిస్తోందని, దీనిపై పవన్కల్యాణ్ స్పందిస్తే బాగుంటుందన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, దళితులపై దాడులు ఏమాత్రం ఆగడం, తగ్గడం లేదన్నారు. రాష్ట్రంలోని రాజకీయపార్టీలు వారి ప్రయోజనాల కోసమే పనిచేస్తాయన్న సత్యాన్ని గ్రహించి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శీతాకాలం .. శ్వాస భద్రం

- భారీగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు పాటించకుంటే రోగాలు



చలిమంట వద్ద చిన్నారులు

మదనపల్లె సిటీ: మదనపల్లె చలి ప్రదేశం. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పడిపోతున్నాయి. ఉదయమే మంచు కప్పేస్తుంది. చలితీవ్రత, పొగమంచు పెరిగిపోతున్నాయి. మారిన పరిస్థితుల్లో ప్రమాదకర వైరస్లు పొంచి ఉన్నాయి. శ్వాసకోశ వ్యాధులు, జ్వరపీడితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. శీతాకాలం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా అస్తమా, గుండె, మధుమేహ సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

శీతాకాలంలో రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి వాతావరణంలో ఎక్కువ సమయం గడపకుండా అప్రమత్తంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు వేకువజామున, రాత్రి వేళల్లో బయట సంచరించకుండా ఉంటే ఉత్తమం. ప్రధానంగా పిల్లలు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలి. ఏ మాత్రం అనారోగ్యం తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలి. సకాలంలో చికిత్సలు అందించాలి. అలాగే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు సైతం మరింత జాగ్రత్తగా ఉండటం మంచిది. ఈ క్రమంలోనే శీతాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు.

వ్యాయామం తగ్గించాల్సిందే

ఉదయం పొగమంచు, ఈదురుగాలులు విజృంభిస్తున్నాయి. దీంతో శ్వాసకోస వ్యాధులు ఉక్కిరిబిక్కిరి అవుతుంటాయి. వ్యాయామం చేసే విషయంలో మీరు జాగ్రత్తలు పాటించాలి. వ్యాయామం పేరుతో గంటల కొద్ది ఓపెన్ ఎయిర్ గ్రౌండ్స్, పార్కులలో తిరగడం తగ్గించాలి. ఇంట్లో, ఇండోర్ స్టేడియంలో మాత్రమే వ్యాయామం చేయడం మంచిది. అరగంట పాటు సురక్షిత ప్రాంతంలో నడక, ఆటలు కొనసాగించాలి.

వ్యాధులతో జాగ్రత్త

ప్రస్తుతం ఉష్ణోగ్రతలు ఊహించని స్థాయిలో పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరిగే కొద్ది రక్తనాళాలు సంకోచిస్తాయి. దీంతో అవయవాలలకు రక్తప్రసరణ చేసే గుండె మరింత వేగంగా పని చేయాల్సి ఉంటుంది. ఆక్సిజన్తో కూడిన రక్త సరఫరా తగ్గడంతో గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువ. గుండె జబ్బులు, మధుమేహం,అస్తమా వ్యాధిగ్రస్తులకు శీతాకాలం శత్రువే. శరీరం వ్యాధుల బారిన, పడేది ఈ సీజన్లోనే అధికం. ఎప్పుడైనా గుండెలో చిన్ననొప్పిగా అనిపించినా వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లి డాక్టర్ను సంప్రదించాలి. చిన్నారుల విషయం తల్లిదండ్రులు చాలా జాగ్రత్త వహించాలి. ఉదయం, రాత్రి వేళల్లో బయటకు రానివ్వకుండా చూసుకోవాలి. వయో వృద్ధుల విషయంలో కూడా జాగ్రత్తలు పాటించాలి.

బయటి ఆహారం వద్దు: వాతావరణం చల్లగా ఉంటే చాలు వేడి వేడి బజ్జీలు, బొండాలు విపరీతంగా ఆరగిస్తుంటారు. శీతాకాలంలో అలాంటి ఆహార పదార్థాలకు కొన్ని రోజులు విరామం ఇవ్వాలి. ఫైబర్ అధికంగా ఉండే కూరగాయలు, ఆకుకూరలు, ఏసీకేఓ విటమినుల పుష్కలంగా లభించే పదార్థాలు తీసుకోవాలి.

గోరు వెచ్చని నీటితో ఉపశమనం: చల్లదనంతో ఊపిరితిత్తులలోని పొరలు అతిగా స్పందిస్తాయి. కూల్డ్రింక్లు, ఫ్రిజ్లో పెట్టిన వాటిని సేవించడం ప్రమాదకరం. జలుబు, దగ్గు, జ్వరం బారిన పడిన వారు గోరు వెచ్చని నీటిని తాగితే కాస్త ఉపశమనం ఉంటుంది. ధూమపానానికి దూరంగా ఉండాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



చలికాలం ఆరోగ్యవంతులు సైతం వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. గుండె జబ్బులు ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలి. చిన్న తేడా కనిపించినా వైద్యులను సంప్రదించాలి. శీతల పానీయాలు, పదార్థాలు జోలికి వెళ్లకూడదు. వ్యాధి నిరోధకశక్తిని పెంచే ఆహారం తీసుకోవాలి. వృద్ధులు, చిన్నారులు మంచులో తిరగకుండా ఉంటే మంచిది.

–డాక్టర్ ఎస్. శివారెడ్డి, గుండెవైద్యనిపుణులు, మదనపల్లె

హైందవ శంఖారావం సభను జయప్రదం చేయండి



ర్యాలీలో విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు

మదనపల్లె సిటీ: విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి సురేష్ కోరారు. ఆదివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద హైందవ శంఖారావానికి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్, సీటీఎం రోడ్డు, చిత్తూరు బస్టాండు మీదుగా శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో వీహెచ్పీ పట్టణ అధ్యక్షుడు రామ్మోహరెడ్డి, హిందూ చైతన్య వేదిక నాయకులు బాలాజీ, బీజేపీ నాయకులు ఎల్లంపల్లి ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, బర్నేపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : హిందూ ఆలయాల స్వయం ప్రతిపత్తి కోసం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు శశిధర్రెడ్డి, బీయారామ్ పటేల్ కోరారు. ఆదివారం హైందవ శంఖారావం ప్రచార రథం ప్రారంభించారు. తలపుల, మేళ్లచెరువు, జాండ్ల, గూడరేవుపల్లె ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 5న మధ్యాహ్నం 12 గంటలకు విజయవాడలో జరిగే హైందవశంఖారావాని పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం, వి.కె. బాలాజి, తిరుపాల్ పాల్గొన్నారు.

కలకడ : హైదవ శంఖారావం సభను విజయవంతం చేయాలని స్వయం సేవక్ సంఘ్ నాయకులు కోరారు. ఆదివారం మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురంలో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి, గోపాలపురం, కదిరాయచెర్వు, పాపిరెడ్డిగారిపల్లె, కలకడ, తదితర గ్రామాల్లో పంపిణీ చేశారు. స్వయం సేవక్ సంఘ్ సభ్యులు బి.మధు, మల్లికార్జున పాల్గొన్నారు.

మేల్మరవత్తూరుకు ఓంశక్తి భక్తులు

మదనపల్లె : మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె, మట్టవారిపల్లెలకు చెందిన ఓంశక్తి మాల ధరించిన భక్తులు శనివారం ఇరుముడి కట్టుకుని తమిళనాడు మేల్మరవత్తూరులో వెలసిన ఓంశక్తి ఆలయానికి బయలుదేరారు. భక్తులు 3, 5, 11 రోజుల దీక్ష చేసి, ఓంశక్తి అమ్మవారి దర్శనం కోసం బయలుదేరారు. భక్తులకు గురుశక్తి ఈశ్వరమ్మ నియమనిష్టలతో ఇరుముడి కట్టించి సుమారు 40 మంది మేల్ మరవత్తూర్ శ్రీ శక్తి అమ్మవారి దర్శనం కోసం బయలుదేరారు.

విశేష పూజలందుకున్న అమ్మవార్లు

సిద్దవటం : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అయిన ఇరుగులమ్మకు ఆదివారం భక్తులకు విశేష పూజలు చేశారు. మండల కేంద్రం శివారులో మూలపల్లె క్రాస్ వద్ద పెన్నానది ఒడ్డున కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. ఆలయ పూజారి వెంకటరమణ ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి కాయాకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పూజలందుకున్న నల్లగంగమ్మ

సంబేపల్లె : లోక పావని.. జగజ్జనని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆదివారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చింది. మండల కేంద్రం శివారులో కొలువైన అమ్మవారి దర్శనార్థం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చారు.

కవులకు ఘన సత్కారం



కవులను సన్మానిస్తున్న ప్రముఖులు

పీలేరు : పీలేరుకు చెందిన తెలుగు కవులకు విజయవాడలో ఘన సత్కారం లభించింది. శనివారం నుంచి రెండు రోజుల పాటు విజయవాడ కనమర్తి భావనారాయణ కళాశాలలో ఆరవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించారు. ఈ సభల్లో పాల్గొన్న జలకనూరి మురళీధర్రాజు తెలుగు భాషా వికాసం తెలుగు జాతి ప్రకాశం అంటూ తెలుగు పద్యాలు ఆలపించారు. సరస్వతి శ్రీరాములరాజు పాటలు, వి.జి. నటరాజన్, స్వీయ రచనలతో ఆకట్టుకున్నారు. తెలుగు రచయితల కార్యనిర్వాహకులు మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గుత్తికొండ సుబ్బారావు, జి.వి. పూర్ణచంద్రారావు, సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి నూతల పాటి వెంకటరమణ చేతుల మీదుగా సత్కారం తోపాటు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. సత్కారం అందుకున్న కవులను పలువురు అభినందించారు.